క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జ్యేష్ట మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం జ్యేష్ట మాస పూజలువె నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ పూజారి తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి పొట్టిశ్రీరాములు జిల్లా పెను శిల లక్ష్మీనరసింహస్వామి (పెంచలకోన) ఆలయం వరకు ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం 5 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని, పాదయాత్రలో పాల్గొనదలచిన భక్తులు ఆలయం వద్దకు ఉదయం 4.30 గంటలకు చేరుకోవాల్సిందిగా కోరారు. మిగిలిన ప్రాంతాల నుండి వచ్చే భక్తులు పాదయాత్ర మధ్యలో కలుసుకోవచ్చన్నారు. భోజన వసతి, తిరుగు ప్రయాణం కొరకు వాహన సౌకర్యం కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


తైక్వాండోలో సత్తా



విద్యార్థులతో తైక్వాండో గ్రాండ్ మాస్టర్లు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ అటానమస్ కళాశాలలో శనివారం తైక్వాండో బ్లాక్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఎస్వీ తైక్వాండో అకాడమీకి సంబంధించిన 10 మంది విద్యార్థినీ, విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఎగ్జామినర్‌గా కర్ణాటక రాష్ట్రానికి చెందిన గ్రాండ్ మాస్టర్ వి.నారాయణ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బ్లాక్ బెల్ట్ టెస్ట్ నిర్వహించడం ఇదే మొదటి సారి అన్నారు. విద్యార్థులు నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. కళాశాల డైరెక్టర్ అరకటవేముల పృథ్వీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఎస్వీ తైక్వాండో అకాడమీకి శ్రీవెంకటేశ్వర డిగ్రీ అటానమస్ కళాశాల నుంచి ఎటువంటి సహాయం కావాలన్న అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ తైక్వాండో అకాడమీ స్థాపకులు గ్రాండ్ మాస్టర్ అలిశెట్టి శ్రీనివాసులు, తిరుపతికి చెందిన గ్రాండ్ మాస్టర్ నారాయణ మూర్తి, శ్రీవెంకటేశ్వర డిగ్రీకళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, కల్లూరు రుద్రసేనరెడ్డి, బెంహర్ వరప్రసాద్, సునీల్, అఖిల్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు ఛైర్మన్‌కు సన్మానం



డీసీసీ బ్యాంకు ఛైర్మన్‌ను సన్మానిస్తున్న పల్లె సుబ్బారెడ్డి

బద్వేలు అర్బన్ : ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులై కడపలో ప్రమాణ స్వీకారం చేసిన మంచూరు సూర్యనారాయణరెడ్డిని శనివారం ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ పల్లె సుబ్బారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబంలో పుట్టి రైతుల సమస్యలను కళ్లారా చూసిన సూర్యనారాయణరెడ్డికి డీసీసీ బ్యాంకు ఛైర్మన్ పదవి రావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు ఆయన అభిమానులు పాల్గొన్నారు.

పరామర్శ



పెసల నరసింహులును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నాయకుడు, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థాన ఛైర్మన్ పెసల నరసింహులు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్న సమాచారం తెలిసిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం రాత్రి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలన్నారు. జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రవచిస్తున్న మేరాజ్ రజా ఖాద్రీ



ప్రొద్దుటూరు కల్చరల్ : ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బద్వేలు అర్బన్ : బక్రీద్ ప్రత్యేకతను వివరిస్తున్న మతగురువు ముఫ్తి అబ్దుల్ హాదీమౌలానా



ప్రొద్దుటూరు కల్చరల్ : బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న సినీనటుడు దావూద్

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని మౌలానా మేరాజ్ రజా పేర్కొన్నారు. శనివారం కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా చూపిన మార్గంలో నడవాలన్నారు. చెడు వ్యసనాలను, దుర్గుణాలను వదిలివేయాలని తెలిపారు. భగవంతుడు చూపిన దయ, క్షేమ మార్గంలో పయనించాలన్నారు. కుర్బాని గొప్పతనాన్ని వివరించారు. పేదలకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. రంజాన్ తర్వాత అత్యంత ప్రాముఖ్యతగల పండుగ బక్రీద్ అని, త్యాగానికి చిహ్నంగా ఈ పండుగను నిర్వహించుకుంటామన్నారు. ముందుగా ఆయన ముస్లింలతో నమాజ్ చేయించారు. ఖాజీ ఇనాయతుల్లా ఖురాన్ గొప్పతనాన్ని, బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను, నమాజ్ విశిష్టతను వివరించారు. పట్టణానికి చెందిన సినీనటుడు దావూద్ బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ కార్యదర్శి ఖురేషి ఇలియాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లారం బాష, ట్రెజరర్ వలి, మెంబర్ సాదిక్, మత పెద్దలు పాల్గొన్నారు. పట్టణంతోపాటు పరిసరాల గ్రామాలకు చెందిన ముస్లింలు ఈ ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ప్రార్థనలు ముగిసేవరకు కొర్రపాడు రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు పోలీసులు అమలు చేశారు. ప్రార్థనలు అనంతరం ముస్లింలు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

చాపాడు : మండల వ్యాప్తంగా శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు పండుగ జరుపుకున్నారు. మండలంలోని చాపాడు, అల్లాడుపల్లె, ఖాదర్‌పల్లె, పెద్దగురువళూరు, తిమ్మాయపల్లె, అయ్యవారిపల్లె, రాజుపాలెం, వెదురూరు, గుంతచీపాడు, కేతవరం, అన్నవరం, మడూరు గ్రామాలలోని ముస్లింలు ఈద్గాలలో బక్రీద్ ప్రార్థనలు జరుపుకున్నారు. అనంతరం గ్రామాల్లో ముస్లింలు ఆలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

మైదుకూరు : మైదుకూరులో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక నంద్యాల రోడ్డులోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీకగా పేర్కొంటూ మత పెద్దలు బోధనలు చేశారు. పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

బద్వేలు అర్బన్ : బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని మతగురువు ముఫ్తి అబ్దుల్ హాదీమౌలానా తెలిపారు. పట్టణంలోని ముస్లింలు శనివారం బక్రీదు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక సిద్దవటంరోడ్డులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువు మాట్లాడుతూ దైవం నియమించిన ప్రవక్తలో హజరత్ ఇబ్రహీం ముఖ్యులన్నారు. ఈ పండుగ ప్రతి ముస్లీం తన సంపాదనలో మూడు భాగాలు చేసి అందులో రెండు భాగాలు పేదలకు పంచడం ద్వారా స్వర్గప్రాప్తి కలుగుతుందని బోధించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాస్క్ కమిటీ ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం కల్పించారు. ఈద్గా వద్ద బద్వేలు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ

కాశినాయన : మండలంలోని ముస్లింలు త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నూతన వస్త్రాలను ధరించి ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాలో మత పెద్దలు అల్లా సందేశాన్ని వినిపించారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



చాపాడులో..



నరసాపురం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మాన్యువల్ కౌన్సిలింగ్‌లోనే బదిలీలు చేపట్టాలి



ఎంఈఓ ఆఫీసు వద్ద ఉపాధ్యాయనాయకుల నిరసన

పోరుమామిళ్ల : అధిక సంఖ్యలో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు మ్యాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారానే బదిలీలు చేపడతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు సుబ్రమణ్యం, చెన్నయ్య, రాంభూపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పోరుమామిళ్ల మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద వారు నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గతంలో ప్రభుత్వం జరిపిన చర్యల్లో స్పష్టమైన హామీ ఇచ్చి, ఇప్పుడు హామీని తుంగలో తొక్కి వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడం అన్యాయమన్నారు. బదిలీకి దరఖాస్తు చేసుకున్న ఎస్జీటి ఉపాధ్యాయుడు వేల సంఖ్యలో వెబ్ ఆప్షన్లు పెట్టుకోలేక, అనుకున్న స్థానాలు పొందలేక అష్టకష్టాలు పడుతున్నాడన్నారు. బలవంతంగా వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని చూస్తే వెబ్ కౌన్సిలింగ్ బహిష్కరిస్తామన్నారు. ఏ మాత్రం ఆర్థిక సంబంధం లేని బదిలీల విషయంలోనే ఇలా మోసం చేస్తే ఇక మిగిలిన అంశాలలో ప్రభుత్వ వైఖరి ఏ విధంగా ఉంటుందో దీనిని బట్టే అర్థమవుతుందన్నారు. ఉపాధ్యాయులందరూ వెబ్ ఆప్షన్ ఇవ్వకుండా నిరస తెలుపాలన్నారు. బలవంతపు బదిలీలు చేపడితే ఉపాధ్యాయుల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని మ్యాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలన్నారు.

ఆదివారం డీఈఓ ఆఫీసు ముట్టడి

ఆదివారం జరిగే డీఈఓ ఆఫీసు ముట్టడిలో ఉపాధ్యాయులందరూ భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు కృష్ణారెడ్డి, చంద్రహాసరెడ్డి, బాలరాజు, శ్రీనివాసులు, సత్తార్, గురయ్య, ఈశ్వరరావు, బాలచంద్ర, రమణ, పుల్లయ్య, చెన్నక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పెండింగ్‌లో ఉన్న రాయలసీమ నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర కోరారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ నెల్లూరు ప్రకాశం జిల్లాల నీటి కొరతకు శాశ్వత పరిష్కారం అంటూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలుగు తల్లికి జల హారతి పేరుతో రూ.80,112 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి బనకచర్ల ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే ఇవేవీ రాయలసీమ తాగు సాగు నీటి కష్టాలు తీర్చడం కోసం కాదని అధికార పార్టీ నేతల ఆర్థిక లోటును తీర్చుకోవడం కోసమేనని విమర్శించారు. జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో పూర్తి సామర్థ్యంతో నిర్మించాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సూపర్ బజార్ రోడ్డులోని శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం విడుదలైన ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ప్రతిభకనబరిచారు. జూనియర్ ఎంపీసీలో గణేష్ 467, చందన 466, రంగహర్షవర్ధన్, సుమయసుల్తాన, పూజిత, పుష్పలత, రుక్సాన, మహ్మద్ షాజద్, కృష్ణతేజ, హదిల్, తేజేశ్వరి, ఈశ్వర్ 465 మార్కులు సాధించారు. బైపీసీలో తౌసిఫా సుల్తాన, పవన్ కుమార్ 435, అంజుమ్, సోమేశ్వరి, మహిత 433 మార్కులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ రమణరావు, డైరెక్టర్లు శ్రీకాంత్ కుమార్‌రెడ్డి, రామమోహన్, దస్తగిరి, అధ్యాపకులు అభినందించారు.

భావన జూనియర్ కళాశాల..



భార్గవి



లక్ష్మీదీపిక

స్థానిక భావన జూనియర్ కళాశాల విద్యార్థులు జూనియర్ ఎంపీసీలో భార్గవి 465 మార్కులు, లక్ష్మీదీపిక, గురు అనూహ్య, శరణ్య 464 మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ రాజారెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్య శర్మ, డైరెక్టర్ షమీవుల్లా, అధ్యాపకుడు నరసింహారెడ్డి అభినందించాడు.

శారద జూనియర్ కళాశాల..



గీతిక



అయేషా

స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలోని ఎంఎస్ శారద జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. ఎంఈసీలో గీతిక 491, హెచ్ఈసీ అయేషా 485, రోషిణి 482, బైపీసీలో జ్యోతిర్మయి 431, గురు సందీప్ 403, ఎంపీసీలో భవాని 457 మార్కులు సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ సురేష్‌బాబు రెడ్డి అభినందించారు.


యాంత్రీకరణతో పంటల సాగు సులభతరం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : యాంత్రీకరణతో వ్యవసాయంలో పంటల సాగు సులభతరమైందని మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను శనివారం బద్వేలు మండలంలో నిర్వహించారు. బయనపల్లె, చింతల చెరువు, తిప్పనపల్లె, వెంకటశెట్టిపల్లె, కోనసముద్రం, గోపులాపురం, నందిపల్లె గ్రామాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ వరి నాట్లను వేయడం, కలుపు యంత్రాలు, వరి కోత యంత్రాలు వంటితో పాలు పురుగు మందులను పిచికారి చేసేందుకు ప్రస్తుత కాలంలో ఆధునిక డ్రోన్లను రైతులు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో వ్యవసాయ పనులు సులభంగా మారాయన్నారు. జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ఉమాకాంత్ చిరుధాన్యాల్లోని రకాలు, ప్రాధాన్యత గురించి వివరించారు. వేసవిలో లోతు దుక్కులు గురించి, దానిమ్మలో పూత నివారణ గురించి రైతులకు సమగ్రంగా తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణం కళాశాలకు అటానమస్ హోదా



అటానమస్ హోదా సాధించిన రాచపూడి నాగ భూషణం డిగ్రీ, పీజీ కళాశాల

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలోనే నాక్‌లో ఎ-గ్రేడు సాధించి అటానమస్ (స్వయం ప్రతిపత్తి) స్థాయికి చేరిన ఏకైక విద్యాసంస్థ రాచపూడి నాగభూషణం కళాశాల అని ఆ కళాశాల ఏ.ఓ. రాచపూడి వెంకట సాయి క్రిష్ణ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బద్వేలు పరిసరప్రాంత విద్యార్థులకు కొన్ని దశాబ్దాలుగా నాణ్యమైన విద్యనందిస్తు ఎప్పటికప్పుడు కాలానుగుణంగా విద్యాబోధనలలో సాంకేతిక మార్పులను తీసుకొస్తూ వృత్తిపరమైన విద్యను ప్రోత్సహిస్తూ వస్తుందని అన్నారు. అలాగే విద్యార్థుల చదువుతో పాటు ఎన్.సి.సి. లోని మూడు వింగ్స్ (నేవి, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్)లో చేరే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. అటానమస్ హోదాను సాధించడం ద్వారా సిలబస్‌ను రూపొందించడం, ప్రశ్నాపత్రాలను తయారు చేయడం, ప్రశ్నాపత్రాల మూల్యాంకనం, కళాశాల ఆధ్వర్యంలోనే జరుగుతాయని తెలిపారు. కళాశాలకు అటానమస్ హోదా 10 సంవత్సరాల పాటు వర్తిస్తుందని తెలిపారు. నాక్‌లో ఎ-గ్రేడు సాధించేందుకు కారణమైన నాక్ అధికారులకు, ఏ.పి. ఉన్నత విద్యాశాఖ అధికారులకు, యోగివేమన యూనివర్శిటీ అధికారులకు, కళాశాల అధ్యాపకబృందానికి కృతజ్ఞులు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



ఆటోడ్రైవర్లకు గుడ్డ సంచులలో బియ్యం పంపిణీ చేస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా జీఈ విండ్‌పవర్‌మిల్స్ ఆధ్వర్యంలో శనివారం ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను అవగాహన కల్పిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల మనుషులకే కాకుండా జంతువులకు, పర్యావరణానికి హానికరమన్నారు. కొనుగోళ్లకు వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరు గుడ్డ లేదా జ్యూట్ బ్యాగులను తీసుకెళ్లడం ఉత్తమమని సూచించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు గుడ్డ సంచులలో కిలో బియ్యం పంపిణీ చేశారు. కమీషనర్ వి.వి. నరసింహారెడ్డి, అర్బన్ ఎస్.ఐ ఎం.సత్యనారాయణ, కె.జయరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు జహీరియా బర్సీ

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గాగా వెలుగొందుతున్న దర్గా-ఏ-గఫారియా దివంగత పీఠాధిపతి హాజి హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ ఆదివారం పీఠాధిపతి సజ్జాద్-ఏ-నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం పీఠాధిపతి ఇంటి నుంచి భక్తులతో ఊరేగింపు జరుగుతుందని వారు తెలిపారు. జహీరియా దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

అధ్వానంగా చెరువులు.. ఆందోళనలో రైతులు

- చెరువు నిండా కంపచెట్లు
- పేరుకుపోయిన పూడిక
- జాడలేని అభివృద్ధి పనులు



ముళ్లకంపలతో నిండిన గంగనపల్లె చెరువు



వరికుంట చెరువులో ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లు

కాశినాయన : రుతుపవనాలు వచ్చేశాయి. అడపదడపు జల్లులు కురుస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే ఆ నీటిని నిల్వ చేయడం ఇప్పుడు సవాలుగా మారింది. చెరువుల్లో నీటిని నిల్వ చేస్తే ఏడాది పొడవునా పంటలకు సక్రమంగా తడులు అందించే అవకాశం ఉంటుంది. కానీ బద్వేలు నియోజకవర్గంలో దాదాపు 150 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. నీటితో కళకళలాడాల్సిన చెరువులు కళాహీనంగా, నిరుపయోగంగా మారాయి. చెరువుల్లో చిన్న చెట్లు, ముళ్ల పొదలు పెరగడంతో నీరు నిలిచే అవకాశం లేకుండా పోయింది. చెరువుల్లో పూడిక తీయకపోవడం వల్ల పిచ్చి మొక్కలు పెరిగాయి. వర్షాలు కురిసినా నీరంతా వృధా అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూడిక పేరుకపోవడం వల్ల ఆయకట్టు విస్తీర్ణం ఏటా తగ్గుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుగా సాగు యాజమాన్య కమిటీలు

చెరువుల అభివృద్ధి కోసం సాగు యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేశారు. కానీ అవి తూతూ మంత్రంగా పనిచేస్తున్నాయి. నెలకోసారి సాధారణ సమావేశం, ఆరు నెలలకోసారి సర్వ సభ్య సమావేశం నిర్వహించి చెరువుల అభివృద్ధిపై చర్చించాలి. కానీ ఎక్కడా సమావేశాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

చెరువుల్లో అభివృద్ధి శూన్యం

చెరువులను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నీరు-చెట్టు పథకం ప్రవేశపెట్టింది. అప్పటి తెలుగు దేశం ప్రభుత్వంలో నీరు – చెట్టు పథకం కేవలం నాయకులను బాగుపరిచేందుకే చేశారు. సక్రమంగా పనులు చేసి ఉంటే చెరువులు ఈ రీతిన ఉండేవి కావని రైతులు వాపోతున్నారు.

అలాగే ఇరిగేషన్ అధికారులు కూడా చెరువుల అభివృద్ధిపై పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాలకులు, అధికారులు, చెరువు నీటి యాజమాన్య సంఘాలు చెరువుల అభివృద్ధిపై చర్యలు తీసుకుని చెరువులకు నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, ముళ్లకంపలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

బదిలీలను మ్యాన్యువల్ విధానంలో చేపట్టాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉపాధ్యాయుల బదిలీలను మ్యాన్యువల్ విధానంలో చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద శనివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్యువల్ విధానంలో బదిలీల కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పిన విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పుడు మాట మార్చడం సరైన విధానం కాదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని బదిలీలను మ్యాన్యువల్ విధానంలో నిర్వహించాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డీఈఓ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. వెబ్ కౌన్సిలింగ్ విధానం వల్ల ఒక్కొక్క ఉపాధ్యాయుడు పాఠశాలలను ఎంపిక చేసుకోవడం కష్టమవుతోందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసరెడ్డి, సుబ్రహ్మణ్యం, సలీం, సుబ్బయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, జాన్ సురేష్, ఓబుళరెడ్డి, బాలయ్య, మోహన్‌రెడ్డి, అల్లాబకాష్, జహంగీర్ పాల్గొన్నారు.